# తెలుగు మాస్టారు (నవలిక)

## శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

### 5

తెలుగు మాస్టారనగానే చిన్నచూపు చూస్తారుకానీ ఒక్కొక్కసారి మా మాస్టారెంత హుందాతనం ప్రదర్శించేవారు!

అవసరార్థం ఆంగ్లభాషని గుర్తించేవారు,

వి. సి. సి లో ఉండే విద్యార్థులు మొదటి పిరియడు మధ్యలో రావచ్చు. అది కన్సెషన్.

సాధారణంగా మా మొదటి పిరియడు తెలుగు మాస్టారిదే.

వి. సి. సి. కుర్రాళ్ళు పాఠం మధ్యలో రాబోతే-

"ఆగండి." అరిచేవారు మాస్టారు.

"పుయాక్ ఎసిసి-" అనేవారు కుర్రాళ్ళు.

"యు యూజెన్ యే సి సి ఆర్ బి. సి. సి. అయామ్ నాట్ కేర్. చుట్టూ తిరిగిరా." గద్దించేవారు.

ఎదురు తిరగడానికి వీల్లేదు.

అలాగే ప్రదక్షిణం చేసి మరీ వచ్చేవారు కుర్రాళ్ళు.

మాస్టారి మాటంటే రామాజ్ఞే.

అదేమిటోకాని నోటీసులూ, సర్క్యులర్లూ తెలుగు మాస్టారి క్లాసుకు వచ్చేవాడు బంట్రోతు.

మొదట చూడనట్లు నటించేవారు.

ఎవరో హెచ్చరిస్తే -నోటీసందుకుని- గడగడ చదివేసేవారు.

రో యీజ్ సన్‌డే ఆన్ అకౌంటాఫ్ హాలీడే."

గొల్లున నవ్వేవారు కుర్రాళ్ళు.

"అస్పష్టంగా చదివానా? ఆంగ్ల భాష అంటే అస్తవ్య మే. పి యు టి పుట్. బియుటి బట్. నీతీ నియమమూలేని భాష. మనుషుల్ని బట్టి భాష. బావకీ, అన్నకీ కజినే. ఆ మనుషుల వావి వరుసలే కలగాపులగం. ఇంగ్లీషులో-పతివ్రతకు సరయిన పదం ఉండదు.

ఆ భాషకి అంతకంటె గౌరవం యివ్వకూడదు."

ఆవేశంగా చెప్పేవారు.

తెలుగు మాస్టారు-ఇంగ్లీషు భాషమీద తనకెందుకు ఓవలి ప్రియం లేదో సోదాహరణంగా నిరూపిస్తూంటే-శ్రోతలు శిల్పాలు కావలసిందే.

మరీ విసుగ్గా ఉంటే ప్యూన్‌నే చెప్పేమనేవారు నోటీసులో విషయాన్ని.

ఒకసారేం జరిగిందంటే...

విలువిద్య గురించి చెప్తున్నారు తెలుగు మాస్టారు.

చెప్పడం అంటే-ప్రత్యక్ష పురాణమే. నారి సారించడం; బాణం వదలడం-మాకు ప్రత్యక్షంగా చూపుతున్నారు మాస్టారు. విశ్వామిత్రుడు-రామలక్ష్మణులకు విలువిద్యా, శస్త్రాస్త్ర ప్రయోగమూ నేర్పుతున్నాడు పాఠంలో.

తెలుగు మాస్టారు విశ్వామిత్రుడే ఐపోయారు.

హెడ్‌మాస్టరు విజిట్స్‌కి వస్తూ-ఏం జరుగుతూందో చూద్దామని క్లాసు గుమ్మంవరకూ వచ్చి ఆగారు.

ఉద్రేకంలో-"నో నోటీస్ నౌ-" అని కేకవేశారు తెలుగు మాస్టారు. హెడ్‌మాస్టారు ముఖం దించుకుని వెళ్ళిపోయారు.

పాఠం చెప్పడంలో అంత ఏకాగ్రత, నిమగ్నత.

తెలుగు మాస్టారికి ఆంగ్లభాషంటే ఏంత చుక్కెదురో చెప్పలేను.

ఓసారి-ఆయన నోటీసుకి చేసిన అనువాదం గమ్మత్తుగా తప్పేసింది. ప్యూన్‌ని చూస్తూ-"రేపు శలవు-" వెళ్ళమన్నట్లు చెయ్యి విదిలించారు-పాఠం సాగనివ్వలేదన్న కోపంకొద్దీ.

మర్నాడు మాతోపాటు మాస్టారూ స్కూలుకి రాలేదు.

తీరచేస్తే ఆ నోటీసుకాస్తా మర్నాడు జరగబోయే ఏదో మీటింగ్ గురించట!

హెడ్ మాస్టరు కేకలేశారు—అంత బొత్తిగా ఇంగ్లీషు రాకపోతే ఎలా అని.

దానికి మాస్టారు చెప్పిన సమాధానం—

"ఇంగ్లీషు రానందుకు విచారించనవసరంలేదు. తెలుగు మరచిపోతున్నందుకే చింతించాలి. సిగ్గుపడాలి. అన్యకాంతలకై వెంపరలాడే విటుడిలా—పరస్త్రీవంటి పరభాషమీద వ్యామోహం దేనికి? నోటీసు తెలుగులోనే వ్రాసి పంపరాదూ? నోటీసులకి తెలుగుభాష పనికిరాదా? మన భాష విలువనిమనమే గ్రహించకపోతే—అంతకంటే సిగ్గుపడవలసిన విషయం మరేమిటుంటుంది?" పిలక పుణికించి మరీ అడిగేశారు తెలుగు మాస్టారు.

మాటలతో సమాధానం చెప్పలేక—కసినంతటినీ కాగితంమీద కక్కేశాడు హెడ్ మాస్టరు. ఫలితం—తెలుగు మాస్టారికి బదిలీ పర్యంతం ఐంది. తరువాత నలుగురూ కలిసి—మసిపూసి మారేడు కాయచేసి బదిలీ రద్దు చేయించారు. అది వేరే విషయం. ఎందుకో—ఇంగ్లీషూ, తెలుగు మాస్టారు బద్ధవైరులు. అందుకే అయామ్ లీవ్, యు ఆరె క్లాస్ వంటి వాక్యాలుపయోగిస్తూ ఇంగ్లీషుని హేళన చేసేవారు.

## 6

సర్వసాధారణంగా తెలుగు మాస్టార్ల నిజ జీవితంలో శృంగారం తక్కువ. శృంగారమంటే పిల్లల్ని కనడం కాదనీ, అంతకంటె చాలా అందమైనదనీ తెలుగు మాస్టార్లకి తెలుసు. దురదృష్టమేమిటంటే నిజజీవితంలో వారికి శృంగారం లభించదు. సౌందర్యం గురించీ, రసికత గురించీ ఎంతో తెలిసిన తెలుగుమాస్టారు—పెళ్ళి విషయంలో అన్నీ మరచిపోతారేమో! ఎక్కడో ఎప్పుడో తప్ప తెలుగు మాస్టారి భార్య అందంగా ఉండదు.

లేక—తెలుగు మాస్టారి విశాల హృదయమూ, రసపిపాసా—బాహ్యసౌందర్యాన్ని అధిగమించి అంతః సౌందర్యాన్నవలోకించడానికలవాటు పడతాయేమో! అందంగాలేని అర్ధాంగితో కూడా హాయిగా జీవించేవారు.

మా గురువుగారి భార్య నోటిదురుసు మనిషి.

మాస్టారంటే తేలిక అభిప్రాయం.

ఐతేనేం—ఆయన కొంచమయినా ఉత్సాహాన్ని కోల్పోలేదు.

శ్రీనాథుని శృంగారవైభవం చెప్పడం మొదలుపెట్టారో, మంత్రముగ్ధులమైపోయామన్నమాటే.

ఎంత చక్కని శృంగారం చెప్పేవారని!

శృంగారమంటే బూతుకాదు. నీతి.

శృంగార రసంలేని జీవితం—వట్టి చెఱకుపిప్పి.

సృష్టి సాగేందుకు ఆలంబనం శృంగారం.

ఎన్నిరకాల నాయికల గురించి చెప్పేవారో మాస్టారు!

విప్రలబ్ధ...వాసవసజ్జిక...అభిసారిక...

ఒక్కొక్కరి గురించీ ఎంత విపులంగా చెప్పేవారు!

మొద్దుబుర్ర—మరచిపోయాను.

అంగాంగ వర్ణనలను అతి సౌందర్యవంతంగా వివరించే తెలుగు మాస్టారు చవుకబారు సెక్సు పుస్తకమని భ్రమించేరు?...ఎంత మాత్రమూకాదు.

శృంగార పాఠాలను ఎలా ముగించేవారో తెలుసా?

"శృంగారం అత్యున్నతమైన అనుభూతి. ఈ అనుభూతిని అర్ధాంగినుంచి పొందడమే న్యాయమూ, ధర్మమూ. మనిషి—మాటకి కట్టుబడి ఉండాలి. వివాహవేళ, నాతి చరామి—అని వాగ్దానంచేస్తాం. ఆ మాటను మీరకూడదు. తాను సుఖపడుతూ, భార్యని సుఖపెడుతూ ఉండాలి. అది మగవాడి కర్తవ్యం. భార్య అంటే కేవలం ఆడది మాత్రమే కాదు. జీవితంలో సగభాగం. నువ్వు సుఖంగా ఉన్నప్పుడే నిన్ను చూస్తుంది వెలయాలు. నువ్వెలాఉన్నా జీవితాంతమూ నీకోసం తపించేది భార్య. అందుకే—పరకాంతలెందరైనను, కులకాంతకు సాటిరారు గువ్వలచెన్నా అన్నది.

వెలయాలి పొందులో లభించేది నిజంగా సుఖంకాదు. ఆ అనుభవాలలో తృప్తి ఉండదు. అది వట్టి నటన. వేడి నీళ్ళతో దాహం తీర్చుకున్నట్లే. వ్యభిచారం నిషిద్ధమ్.

నమ్మినవారిని వంచన చేయకూడదు.

నీ శరీరంమీదా, జీవితంమీదా అనురాగ పూరితమైన హక్కు అర్ధాంగిది. ఆమెనాహక్కునుంచి వంచించబోవడం ఆత్మవంచనే. ఆత్మవంచన అధమాధమమ్. ఆ పాపానికి ఒడిగట్టకండి.

సంసారమనేది—సుమధుర మధు కలశమ్.

వెతుక్కోగలగాలికాని—సంసార సాగరంలో వెలలేని రత్నాలూ మాణిక్యాలూ లభిస్తాయి.

ధర్మపత్నిని మాని పరస్త్రీకై ప్రాకులాడమని—వాగ్దానం చెయ్యండి."

బొత్తిగా పసితనం కాకపోతే—యీ మనుషులమీదా మాటమీదా అంత నమ్మకమేమిటి తెలుగు మాస్టారికి!

చెప్పవచ్చేదేమిటంటే—

తెలుగు మాస్టారు కవి చౌడప్ప శతకంకాదు.

పెద్దబాలశిక్ష.

బూతు పుస్తకం కాదు.

నీతి శతకం.

ఆదర్శంగా జీవించడం ఎలాగో తెలుగు మాస్టారినుంచే తెలుసుకుంటాం మనం.

ఆదర్శ జీవితానికి బాటలువేసే ప్రయత్నాలు చేసేది తెలుగు మాస్టారే. నవరసాలూ జీవితాలలో నింపాలని మనస్ఫూర్తిగా కృషి చేసే మాస్టారు మరెవరు? తెలుగు మాస్టారు తప్ప.

"మాస్టారూ మీరెవరినయినా ప్రేమించారా?" అంటూ అడిగాడొక చిలిపి కుర్రాడు—మాస్టారు చెప్పిన శృంగారం విని.

"ప్రేమించకేం? అప్పటికీ, యిప్పటికి, ఎప్పటికీ ప్రేమిస్తూనే ఉంటాను—" అన్నారు మాస్టారతి సిన్సియరుగా.

"ఎవరిని?"

"నా పెళ్లాన్ని —" టక్కున చెప్పారు మాస్టారు.

కిసుక్కున నవ్వాడు చిలిపి కుర్రాడు. "పెళ్లాన్ని ప్రేమించరు మాస్టారూ!—" అంటూ.

"మరెవరినేనా అయితే—అది ప్రేమ అనిపించుకోదురా కుర్రవాడా!—" ఈసారి తెల్లబోయాడు చిలిపి కుర్రాడు.

"ప్రేమకి వెలుగుని చూసి భయపడవలసిన కర్మ ఉండదు. చీకటిలోనే సాగేది ప్రేమ కాదురా. కామం. ప్రేమలోంచి ఉద్భవించే కామం సర్వజనామోదం. అది నీతిబాహ్యంకాదు. కేవలం కామం—అవినీతి. బలహీనత. ప్రేమించగలగడానికి హృదయం పరిపక్వం కావాలి. ప్రేమ—కేవలం శరీరాశయంకాదు" అంటూ ఘాటుగా చివాట్లుపెట్టి నోరు మూయించారు తెలుగు మాస్టారు.

చాలా లోతుగా పరిశీలించి—ప్రతి విషయాన్నీ పరిశోధించి—అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్లే చెప్పడం తెలుగు మాస్టారికే తగును.

దాంపత్య జీవితంలో ఉండే ఔన్నత్యమూ,

వ్యభిచారంలో ఉండే అల్పత్వమూ—

ఎంత చక్కగా విడమరచి చెప్పేవారో!

తెలుగు మాస్టారు చెప్పిన విషయాలే వంటబట్టించుకో గలిగితే—విద్యావంతులలో యింత శాతం వ్యభిచారు లుండేవారు కారనే నా ప్రగాఢ విశ్వాసం.

పెద్దలు చెప్పని సంసార సూత్రాలెన్నో చెప్పేవారు తెలుగు మాస్టారు. నిజంగా ఆ సూత్రాల నములు జరిపితే—సుఖసంసారమే ఔతుంది. కాని—అన్నీ తెలిసిన మాస్టారు మాత్రం తన సంసారాన్ని సుఖమయం చేసుకోలేకపోయారేమో!

ఎవరో అబ్బాయి అదే ప్రశ్నవేయగా—

"నేను చెప్పినట్లు చెయ్యి. చేసినట్లుకాదు—" అని కొంచం ఆగి ఓ పిట్టకథ చెప్పారు.

"ఒక పల్లెపక్కన—చిన్నకొండ ఉండేది. ఆ కొండమీద వినాయకుడి రాతిబొమ్మ ఉండేది. ఏడాదికోసారి—ఆ వినాయకుడి విగ్రహానికి నమస్కరించి—ఆ విగ్రహం తాలూకు బొడ్డులో చూపుడు వేలు పెట్టి తిప్పితే సకల శుభాలూ కలుగుతాయని అక్కడి ప్రజల విశ్వాసం.

ఆ యేడు—ఒక్కొక్కరూ వేలు వినాయకుడి బొడ్డులో పెట్టడం—వెంటనే వెనక్కి లాగేసుకుని—బలవంతంగా చిరునవ్వు నవ్వుతూ వెనకవాడికి చోటివ్వడం.

అందరూ అలాగే చేశారు.

ఒక్కొక్కళ్లకీ కన్నీళ్లాగడంలేదు.

"బాధ."

"ఎందుకని మాస్టారూ? వినాయకుడి బొడ్డు కరిచిందా?"

"ఆం అతని బొడ్డులో ఒక తేలు యిల్లు కట్టుకుంది. వేలు పెట్టినవారికి బహుమతిచ్చింది."

"కాటు తిన్నాక వెనకవాళ్లకి చెప్పొచ్చుగా కాటుతిన్నవాళ్ళు"

మాస్టారు—అమాయకత్వానికి నవ్వారు. "అలా చెప్పనందుకేగా ఎదురు ప్రశ్న వేశావు నన్ను?"

"నిశ్శబ్దం"

తెలుగు మాస్టారంటే—పిట్టకథలు!

## 7

పండిత పుత్రః పరమశుంఠః.

నిజమే అనిపించేడు తెలుగుమాస్టారి పెద్దబ్బాయి.

తెలుగుమాస్టారి పెద్దబ్బాయి—పట్టి మొద్దబ్బాయే.

తెలుగుమాస్టారి జీవితం—చిక్కులు పడిన దారపుండ.

పెద్దబ్బాయితో గట్టి చిక్కొచ్చిపడింది మాస్టారికి.

ప్రయోజకుడు కాని కొడుకు—తల్లితండ్రులకి కంటకమే.

స్కూలు ఫైనలువరకూ ఎలాగో డేకుతూ వచ్చాడు.

వచ్చాడంటే—తాను వచ్చాడనికాదు.

మాస్టారు తెచ్చారు!

నిజం అంతే.

తెలుగు మాస్టారి ముఖంచూసి—నలుగురు మాస్టర్లూ నాలుగు మార్కులువేసి మెల్లగా స్కూలు ఫైనల్ వరకూ లాక్కొచ్చారు.

ఇక-అక్కడినుంచి కదలనని మొరాయించాడు సుపుత్రుడు.

మాస్టారు శాయ శక్తులా ప్రయత్నించారు.

ఒక్కసారికాదు.

నాలుగుసార్లు.

పుస్తకంలో పేజీలయితే ఐపోయాయికాని అతగాడు పాసవలేదు.

ఒట్టి బండ నాలిక.

సంస్కృతం ముక్కలు వంటపడతాయా ?

తద్దినం మంత్రాలకేనా పనికిరాలేదని వాపోయేవారు మాస్టారు.

మాస్టారిని చాలా దుఃఖపెట్టేశాడు జ్యేష్ఠ పుత్రుడు.

పరువు ప్రతిష్ఠలు కోరుకునేవాళ్లలో మొదటివారు తెలుగు మాస్టారు.

అదేమిటో—అటువంటివారికే అన్ని ఆశాభంగాలూ !

అయ్యవారిని చేయబోతే—కోతి ఐనట్లు —

ఆఫీసరుని చేద్దామనుకుంటే, అతగాడు కాస్తా వంటవాడై కూర్చున్నాడు. అదీ-ఊరుకాని ఊరిలో.

"గుడ్డిలో మెల్ల అని సంతోషించేదా ? కొడుకు దూరమయ్యాడని కుమిలిపోయేదా ?" అని కన్నీరు పెట్టుకున్నారు తెలుగు మాస్టారు.

ఆయన నేమని ఓదార్చగలం పిల్లలం ?

అదేమిటో—చిత్రంగా, తెలుగుమాస్టారి సంతానం ఎక్కడో తప్ప ప్రయోజకులు కారు.

తెలుగుమాస్టారికి గర్భశోకం వ్రాసిపెట్టి ఉంటుంది కాబోలు!

బాలారిష్టాలు తీరకుండా పోయిన పిల్లలు ముగ్గురో నలుగురో.

నేనన్నాననికాదు...తెలుగుమాస్టారికి సంతాననష్టం — తప్పని శాపం. విషాదకరమయిన అనుభవాలన్నీ తెలుగుమాస్టారిని వరించి వదులుతాయికాబోలు !

కష్టాలకికూడా సరదాయే తెలుగుమాస్టారంటే.

చేతికందివస్తాడనుకున్నకొడుకు — పత్తాలేకుండా దేశాలుపట్టి పోయాడు.

ముద్దూ ముచ్చటా చూడకుండానే-ముత్యాల్లాంటి ముగ్గురు పిల్లలని మృత్యువెత్తుకుపోయింది.

సరే.

అయినదేదో అయింది.

అర్ధాంగినికూడా తీసుకుపోవాలా ?

ఆమెనుకూడా లాక్కుపోతే మాస్టారేమయిపోవాలని ?

ముందువెనుక లాలోచించలేదు విధి.

అర్ధాంగినికూడా కరువు చేసింది మాయదారికాలం.

ఆరోజు — మాస్టారిగుండెలు పగిలిపోతాయనే భయపడ్డాం — చూసిన పిల్లలం అందరమూ.

భార్య కళేబరం మీద పడి—ఎంత హృదయవిదారకంగా రోదించారు మాస్టారు !

మాకూ ఏడుపు వచ్చేసింది.

ఇక ఆయన్ని మేమేం ఓదార్చగలం ?

ఆమె నెంత ప్రాణాధికంగా ప్రేమించారో తెలుగుమాస్టారు !

"నోరు కాస్త పెద్దది ... కాని—హృదయం ఎంత విశాలం! నాలాటి మనిషితో ఆవిడ కనుక కాపరం చెయ్యగలిగింది ! ఆవిడ తన మానాన తాను వెళ్ళిపోయింది నన్ను ఒంటరివాడినిచేసి. అన్నపూర్ణా! నన్నెందుకు వదిలిపోయావ్ ?

నేనూ నీతో వచ్చేస్తాను —"

నలుగురూ ముక్కున వేలేసుకున్నారు.

సతీసహగమనమే గతంలోకి జారిపోయి-కథలుగా మారిపోయింది.

పతీ సహగమనమా !

అందులోనూ, శాస్త్రాలూ వేదాలూ పఠించిన—తెలుగుమాస్టారువంటి విజ్ఞాని—భార్యతోపాటు మరణించబోడమా !

ఎంత ఉన్నతమైన ప్రేమ!

అర్ధాంగికి-జీవితంలో ఎంత చక్కని స్థానం!!

ఎవరన్నారు తెలుగు మాస్టారిని ఛాదస్తుడని ?

స్త్రీని ఆ మనంతగా గౌరవించే ఆదర్శ పురుషు లెవరు?

వట్టిమాటలు కాకుండా—హృదయాంతరాలలోకూడా స్త్రీకి విలువ యివ్వగలిగే తెలుగుమాస్టారు !

ఎంతమంది వారిలా అర్ధాంగిని ప్రేమించగలరు ?

"మీరలా అంటే పిల్లలేమైపోవాలి మాస్టారు ?"

ఎవరో అన్నారు.

మాస్టారు—పిల్లల ముఖాలు చూశారు.

ఒక క్షణం...

ఏదో నిర్ణయానికివచ్చినట్లు ముఖంలో మార్పు.

నలుగురు పిల్లల్నీ దగ్గరకి తీసుకున్నారు.

దుఃఖాన్నీ దైన్యాన్నీ దూరంగా తరిమేశారు.

పిల్లలంటే ప్రేమ.

వారి జీవితమంటే ప్రేమ.

ఒకరికోసం — తాను దహించుకుందుకు కూడా సిద్ధమయ్యే వ్యాత్మే - తెలుగుమాస్టారు.

భార్యా వియోగంతో ఆయన బ్రతుకు శూన్యమైనమాట అతి వాస్తవం. పగిలిన గుండెతో—పిల్లలకోసం జీవించడానికే సంకల్పించు కున్నారు. నిజాని కాయనకు మిగిలిందేమిటి ?

## 8

తెలుగుమాస్టారికి స్థిరమయిన విశ్వాసాలుంటాయి.

వాటిని- కాలగమనం మార్చలేదు.

పరిస్థితులు—చెదరగొట్టలేవు.

ఎందుచేతనంటే —

వారి విశ్వాసాల వెనుక బలమైన సిద్ధాంతాలుంటాయి.

ఎంతో అనుభవం ఉంటుంది.

ఎన్నెన్నో ఆలోచనలుంటాయి.

అందుకే వారి విశ్వాసాలచంచలాలు.

కళలంటే వారికి గౌరవం తక్కువనికాదు.

స్త్రీలపై దురభిప్రాయం అంతకంటెకాదు.

కాని-రేడియోవాళ్ళు స్వయంగా ఆహ్వానించినా — పెద్దమ్మాని విజయవాడ పంప నిరాకరించారు.

ఆమెపేరు శారద.

కొందరిపట్ల నామధేయాలు సార్ధకత నంతరించుకుంటాయి.

ఆ కోవకి చెందినదే శారద.

కంఠం—కోయిలకంఠమే.

గళమెత్తి గానంచేస్తే—వసంతం తొంగిచూడవలసిందే.

తీయని కంఠంతో త్యాగరాయకృతి అందుకుంటే—తెరతీసి— రావలసిందే.

అతిశయోక్తి కాదు.

అంత చక్కని స్వరమే.

"మీ అమ్మాయిచేతరేడియోలో పాడించేందుకు అనుమతించం" డంటూ అభ్యర్థించారు రేడియో అధికారి.

నమ్రంగా చెప్పారు తెలుగు మాస్టారు. "మీ ఆదరాభిమానాలకు అమిత కృతజ్ఞతలు. అమ్మాయి బాగానే పాడుతుంది. కాదనను. కాని—కచేరీలు చేయించే ఆలోచన నాకులేదు—క్షమించండి."

"కళని—దాచివెయ్యడం—ద్రోహం ఔతుందేమో ! అందరూ విని ముగ్ధులు కావలసిన గానమాధుర్యాన్ని—మీయింట బందించ బోవడం—న్యాయమే అంటారా ? కళాకారిణిగా తన ప్రతిభను దశదిశలా వ్యాప్తి చెయ్యగలిగిన అమ్మాయిని..."

"మీ మాట కాదనను. కాని — కళకంటె జీవితం ముఖ్యం. శారద వయస్సు పదహారు. పెళ్ళిచేస్తే — కలకలలాడుతూ కాపురం చేసుకోవలసిన అమ్మాయి. కళపేరిట—దాని సౌఖ్యాన్ని నాశనంచేసేదా? నామీద అభిమానంకొద్దీ — నా మాట కాదనలేక — తన కళని వ్యాపారంగా మార్చడానికంగీకరించినా తరువాత విచారించదూ? యౌవనం వృధాగా గడిచిపోయిందని ? గడచినకాలమూ, చేజారిన జీవితమూ తిరిగి రావుకదా ?

నన్ను మరోలా భావించకండి.

పదిమందిలో పాడటానికి అమ్మాయి అట్టే సుముఖంగాలేదు. వత్తిడి చేయడం నాకిష్టంలేదు."

"రేడియోలో పాడటానికీ, కచేరీ చేయడానికీ తేడాఉంది మాస్టారూ ?"

"ఔను. తెలుసు. కాని... కీర్తి అనేది కర్పూరపు ముద్ద వంటిది. అగ్నిశిఖ సోకితే-పరిమళాలను వ్యాప్తి చేసుకుంటూ పోతుంది. వాటి నాపడం అసాధ్యం."

మాస్టారి దూరదృష్టిని ఎదుర్కోలేకపోయారు రేడియో అధికారి. మాస్టారి ఆలోచనావైఖరి నాకూ అవగతంకాలేదు.

ఆయనకు ఆర్థికమైన యిబ్బందులు లేకపోలేదు.

సంగీతంపట్ల తక్కువ అభిప్రాయాలూ లేవు.

మరి—శారద నెందుకు రేడియోలో పాడనీయలేదు ?

సంప్రదాయాలు అడ్డుపడుతున్నాయా ?

శారదమీద నమ్మకం తక్కువా ?

ఏదో సందర్భం చూసుకుని యీ విషయం కదిపాను.

"ఎంతో చక్కని అవకాశాన్నెందుకు జారవిడుచుకున్నారు మాస్టారూ ?"

"శారద—పెద్దమ్మాయి. అన్నపూర్ణ ఆత్మ శాంతించాలంటే శారద పెళ్ళి చెయ్యాలి. అదీకాక — కాపురానికి పంపవలసిన అమ్మాయిని—కళపేరిట - ఆ సౌఖ్యంనుంచి దూరం చెయ్యడం న్యాయమనిపించడంలేదు."

జీవితమంటే ఎంత ఉన్నతమైన అభిప్రాయం !

"సంబంధాలు చూస్తున్నారా మాస్టారూ ?"

"మా అమ్మాయి-శారద — కోసం—సంబంధాలు అవే వస్తున్నాయి!—"

"ఎవరు మాస్టారూ?"

"మేనరికం..." గర్వంగా చెప్పారు తెలుగు మాస్టారు. 'రేడియోవాళ్ళు వచ్చి వెళ్ళిన మూడోనాడే మా బావగారు వచ్చారు. కట్నం అక్కర్లేదట. నేడో రేపో తాంబూలాలు పుచ్చుకుంటాం-"

"పెళ్ళికి కావలసిన సాయం మేం చేస్తాం మాస్టారూ!-" ఎంత హాయిగా నవ్వారు మాస్టారు!

"అలాగే. ఎందరు సాయం చెయ్యకపోతే జరుగుతుంది!... అందులోనూ అర్ధాంగి లేనివాడినాయె!..."

మాస్టారి వియ్యంకుడు మహా గడుసువాడు.

కట్నం అక్కరలేదనగానే పొంగిపోయారు మాస్టారు!

కానుకల రూపంలో అంతకి రెట్టింపు వసూలు చేశారు-మగ పెళ్ళివారు.

మెత్తని వాళ్ళనిచూస్తే ఎవరికయినా మొత్తబుద్ధే కాబోలు! అయినా మాస్టారి అమాయకత్వం కాకపోతే మేనరికం గురించి ఎందుకంత పట్టింపు?

అదే అలుసు తీసుకున్నారు అవతలివాళ్ళు.

తెలుగు మాస్టారికి—బంధుప్రీతి అధికం.

కాకపోతే-ఎలిమెంటరీ స్కూలు పంతులికి-ఏమాత్రమూ భవిష్యత్తు లేనివాడికి-శారదలాటి చక్కని చుక్కను-కట్టబెడతారా!

అతగాడేం చేశాడు?

ఇలా పెళ్ళయిందో లేదో పెళ్ళాన్ని రేడియో స్టేషనులో పాడించాడు.

గానకచేరీలు చేయించసాగాడు.

ఏతావతు-జరిగిందేమిటి ?

శారద సంగీతాన్ని సొమ్ము చేసుకోడం!

పైగా-మామగారిని నిష్ఠూరం ఆడాడట కూడా!—శారదకి చిన్నప్పటినుంచే కచేరీలు చేయడం అలవాటు చేయలేదని.

మాస్టారి ఆశలేమయ్యాయి?

అమ్మాయి ఆనందంగా కాపురం చేసుకోవాలని కలలు కన్నారు.

అతను ఆమెనుంచి డబ్బు పిండుకోసాగాడు!

తెలుగు మాస్టారికి మిగిలింది ప్రావిడెంట్‌ఫండ్ లోను!

అల్లుడు—శారదని కొడతాడు కూడా!...ఆ మాట చెప్పుకుని—ఆ దెబ్బలు తనకే తగిలినంత బాధపడిపోయారు మాస్టారు.

ఆయన దృష్టిలో-సంసారమంటే తీయనిగానం.

అపశ్రుతులకి తావే ఉండకూడదు.

## 9

దిగి రాను దిగిరాను దివినుండి భువికి...

దిగిరావాలి మాస్టారూ...మీరెంత తెలుగు మాస్టారయినా దివినుండి భువికి దిగి రావలసిందే. తప్పదు.

ఇది-జీవితం మాస్టారూ. జీవితం.

ఊహాలోకంనుంచి చూడకండి.

ఈ కాలపు కుర్రాళ్ళు మీ ఊహల కందరు.

అంచనాలకి దొరకరు.

మీ రెండో అబ్బాయి ఏం చేశాడు ?

మిమ్మల్ని బాధ పెట్టాలని కాదు మాస్టారూ.

జీవితంతో రాజీ పడటం నేర్చుకోక తప్పదని.

మీకూ మాకూ ఓ తరం అంతరం.

ఈ తరాల అంతరాలలో...

నైతిక విలువలు కొత్త ముసుగులు వేసుకుంటున్నయ్.

నీతి సూత్రాలు రూపు మార్చుకుంటున్నాయ్.

కాలం చేసే గారడీలు తెలుగు మాస్టారూ!

ఛందస్సు కందవు.

యతిప్రాసలకు లొంగవు.

గణవిభజన-వృథామాస్టారూ. వృథా. వృథా.

సంప్రదాయాలు అంతరించిపోతూంటే· మీరేం చెయ్యగలరు?

పై వూళ్ళో చదువు.

మూడువేలు ఖర్చుచేశారు.

రెక్కలు ముక్కలు చేసుకున్నారు.

నెలకి నెలకీ మనియార్డర్లు పంపారు.

డి. గ్రిహోల్డరుని చేశారు. కాని-

ఉద్యోగం వేయించలేకపోయారు.

అదేగా మీరు చెయ్యలేకపోయారు!

గడ్డురోజులు.

గడ్డి కరవనిదే పనులయ్యే కాలం కాదు.

లంచాలివ్వడానికి జంకితే వీలా మాస్టారూ?

ఆ పరాత్పరుడు సర్వాంతర్యామి ఔనో కాదో ?

లంచంమాత్రం సర్వాంతర్యామి సుమండీ!

చిన్న నిజం-గుర్తించలేకపోయారు.

కొడుకుని దూరం చేసుకున్నారు.

జాలేస్తోంది మాస్టారూ.

మిమ్మల్నిచూస్తే అపరిమితమైన జాలేస్తోంది.

అందివస్తాడని ఆశించిన అబ్బాయి దూరమైతే భరించడం ఏ తండ్రితరం? అందులోనూ మీరు తెలుగు మాస్టారు. ప్రేమాభిమానాలపాలెదికం.

ఫర్లేదు మాస్టారూ. ఫర్లేదు.

మీ అబ్బాయి ఎక్కడో సురక్షితంగానే ఉంటాడు.

మీకు చెప్పకుండుకు వీల్లేని ఏదో ఉద్యోగం చేస్తూ ఉంటాడు.

నేడో రేపో మీకు ఆ వర్తమానమూ వస్తుంది.

ధైర్యం తెచ్చుకోండి మాస్టారూ. మా అందరికీ విలా ధైర్యం చెప్పేవారో మరచిపోయారా?

లంచంయిచ్చి ఉద్యోగం వేయించి కొడుకుని దక్కించుకోలేక పోయినందుకేగా మీ బెంగ?

అన్నీ చేసి ఉద్యోగం వేయించినా మీ అబ్బాయి మీ దగ్గరుండేవాడు కాడేమో! రోజులు మాస్టారూ. రోజులు.

కు రతనం వెర్రితలలు వేస్తున్న రోజులివి.

చింతించకండి.

మనదేశం అమెరికా అడుగు జాడలలో నడవాలని విశ్వ ప్రయత్నం చేస్తోంది. సంస్కృతీ, సంప్రదాయమూ అంటారా! అవన్నీ ఎక్కడో మీవంటి వాళ్లకి. ప్రజాస్వామ్యంలో మీవంటి వారి ఉద్దేశాలకు డిపాజిట్ దక్కదు. మీరే చెప్పేవారు—'పదుగురాడుమాట పాడియై ఒప్పు'నని.

అమెరికా అంటే—పేరెంట్ హోమ్స్ వగైరా హంగులతో—వాత్సల్యాభిమానాలను తగ్గించడానికికృషిచేస్తోంది. నాగరికతలో-అనుబంధాల విలువలు అల్పం ఔతాయి మాస్టారూ. ఈ చిన్న చేదునిజం అంగీకరించారో-మీ మనసు తేలికపడి తీరుతుంది. వెల్లువ నెదిరించడం అతికష్టం. ఎంత గొప్పవాళ్లయినా-మంచివాళ్లయినా-కాలానికెదురు నిలవలేరు మాస్టారూ.

ఏమిటలా ఆశ్చర్యపోతారు ?

గుడ్డొచ్చి పిల్లను వెక్కిరిస్తోందనా?

నీతి సూత్రాలు రూపు మార్చుకున్నాయి మరి.

అందుకే-పిల్లలు చెప్పడమూ, పెద్దలు వినవలసి రావడమూ.

కాలం తిరగబడింది మాస్టారూ! తిరగబడింది.

అందుకే మీ రెండో అబ్బాయీ మీకు దూరం ఐపోయాడు.

మారుతున్న వ్యవస్థలో మారలేకపోతున్న మనుషులు మీరు.

అందుకే మీ హృదయంలో యీ మంటలు...మారణహోమం.

మారండి మాస్టారూ...మారండి...మారండి.

మీకోసం...మాకోసం...మారండి, మారండి.

మారగలిగే మనుషులకే యీ సమాజం.

మారలేనివారికి-మనుగడ సమస్యామయం.

మీ అబ్బాయిలు మారలేదూ ?
మీ అమ్మాయి మారలేదూ?
మీ సంప్రదాయాలు వాళ్లేం నిలుపుతున్నారు?
ఆలోచించండి మాస్టారూ. ఆలోచించండి.

[ ఇంకా వుంది ]